సాక్షి
నిర్మల్
శుక్రవారం । 5 । జూలై । 2024



పాముల కాలం.. జర భద్రం
వర్షాకాలంతోపాటు 'బాబోయ్ పాము' అంటూ భయపడే రోజులొచ్చేశాయ్. మనిషి ప్రాణాలు తీసే సర్పాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందే. 8లో▸



మురుగునీరు వెళ్లేదెలా?
సారంగపూర్ మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో స్వర్ణ–నిర్మల్ ప్రధాన రహదారికి పక్కన మురుగునీరు నిలుస్తోంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.4 /26.3

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి సంపూర్ణత అభియాన్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: నీతీ ఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 6వ తేదీన పెంబి మండల కేంద్రంలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. పెంబి మండలంలోని ప్రతీ గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, మండల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాబోవు మూడు నెలల కార్యాచరణ లక్ష్యాలు, చేపట్టబోవు అభివృద్ధి పనులను గ్రామసభల ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. ఈనెల 6న (శనివారం) పెంబి మండల కేంద్రంలో ప్రారంభ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, సభా వేదిక వద్ద విద్యార్థులతో సాంస్కృతిక నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు తెలియజేసేలా ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీడబ్ల్యూవో నాగమణి, డీపీవో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఎంహెచ్‌వో ధనరాజ్, డీఏవో అంజిప్రసాద్, పెంబి మండల అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనల్ ఫ్రీ భైంసాయే లక్ష్యం

- ఏఎస్పీ అవినాష్‌కుమార్
- కుంసర ఘటన కేసులో ఇద్దరిని రిమాండ్ చేసినట్లు వెల్లడి



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్ కుమార్, చిత్రంలో సీఐలు నైలు నాయక్, డి.రాజారెడ్డి

భైంసాటౌన్: రాష్ట్రంలో భైంసా పట్టణానికి సున్నిత ప్రాంతమనే పేరు ఉందని, ఆ భావనను తొలగించడమే లక్ష్యంగా పనిచేస్తానని భైంసా ఏఎస్పీ అవి నాష్‌కుమార్ తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం సమావేశంలో మాట్లాడారు. మండలంలోని కుంసర గ్రామంలో ముగ్గురు వ్యక్తుల మధ్య వాగ్వాదం, ఇరువర్గాల ఘర్షణకు దారి తీసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈనెల 3న కుంసర గ్రామంలో అబ్దుల్ అజీజ్, నవీన్‌రెడ్డి, రితేష్‌రెడ్డి మధ్య గొడవ ఘర్షణకు దారితీసింది. అబ్దుల్ అజీజ్ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు ఘర్షణకు కారణమైన ఇద్దరిని అరెస్ట్ చేసి 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీకి తరలించి నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు డి.రాజారెడ్డి, నైలు నాయక్ ఉన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మరువలేనిదని అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య ముఖ్య భూమిక పోషించారని గుర్తుచేశారు. త్యాగధనులను స్మరించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మహనీయుల జయంతి, వర్ధంతులు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజేశ్వర్‌గౌడ్, సహాయ అధికారి గంగాధర్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో ధనరాజ్, ఇతర అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముంపుపై కదలిక..

- జిల్లా కేంద్రంలో డ్రెయినేజీలను పరిశీలించిన బీజేఎల్పీనేత
- ముందస్తు పరిష్కారం చేపట్టాలని అధికారులకు సూచన
- డ్రెయినేజీలపై ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపాలిటీ
- 'సాక్షి'లో వరుస కథనాలతో చర్యలు



శివాజీచౌక్‌లో నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



శివాజీచౌక్‌లోని డ్రెయినేజీలో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు



మళ్లీ మునగాల్సిందేనా..?



ముంపుపై పట్టింపేది?

ఇటీవల 'సాక్షి' ప్రచురించిన వరుస కథనాలు

నిర్మల్: జిల్లా కేంద్రం 'మళ్లీ మునగాల్సిందేనా..!?', పాలకులు, అధికారులూ 'ముంపుపై పట్టింపేది..?' అంటూ నిర్మల్ ముంపు సమస్యపై ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు పాలకులు, అధికారులు స్పందిస్తున్నారు. ఈనెల 27న కలెక్టర్ అభిలాష అభినవ్ పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. బీజేఎల్పీ నేత, స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి గురువారం డ్రెయినేజీలను పరిశీలించారు. మున్సిపల్ అధికారులు సైతం ముంపు కారకాలపై చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో నాలాలపై కట్టడాలను తొలగిస్తున్నారు. మిగతాచోట్లా ఇలాగే పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ముంచుతున్న ఆక్రమణలు..

450 ఏళ్లకు పూర్వం ఏర్పడ్డ నిర్మల్ పట్టణం మూడునాలుగేళ్లుగా వర్షాకాలంలో మునుగుతోంది. ఇందుకు మురుగునీరు, వర్షపునీరు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడమే కారణం. జిల్లా కేంద్రంలోని ప్రతీ నాలానే కాదు.. చివరకు డ్రెయినేజీలనూ ఆక్రమణదారులు వదలడం లేదు. ఇలాంటి ఆక్రమణలతో దాదాపు 30 ఫీట్ల వెడల్పు ఉండాల్సిన కందకాలు, నాలాలు ఇప్పుడు మూడు ఫీట్లకు కుచించుకుపోయాయి. ఈనేపథ్యంలోనే మూడునాలుగేళ్లుగా నిర్మల్ మునుగుతోంది. ప్రతీ వానాకాలం సీజన్‌లో ఈ సమస్య ఎదురవుతూనే ఉన్నా.. ఇప్పటికీ శాశ్వత పరిష్కారాలు చేపట్టకపోవడం గమనార్హం. ప్రతీసారి అప్పటికప్పుడు తాత్కాలిక చర్యలతోనే సరిపెడుతూ వస్తున్నారు.

కొత్త ఏరియాల్లోనే..

దశాబ్దాల క్రితం నుంచి ఉంటున్న నిర్మల్ పాత ఏరియాల్లో ఇప్పటికీ ముంపు సమస్య లేదు. జౌళినాళా పరీవాహకంలోని ఒకట్రెండు ఏరియాలు మినహా ఎక్కడా ఇప్పటి వరకు ముంపు అనే మాటే రాలేదు. కానీ.. కొత్తగా ఏర్పడిన కాలనీలన్నీ మునుగుతూనే ఉన్నాయి. లేదంటే.. మొత్తం బురదగుంటలతో నిండిపోతున్నాయి. ఇందుకు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడమే ప్రధాన కారణం. ఇప్పటికీ ప్రియదర్శినినగర్, శాస్త్రినగర్, శ్రీనగర్, వినాయక్‌నగర్, ఏఎస్‌రెడ్డి కాలనీ, రవినగర్, విజయనగర్, శాంతినగర్, మంజులాపూర్‌లలోని కొన్నిప్రాంతాలు వర్షం కురిస్తే బురదమయం అవుతున్నాయి. ఇక సిద్ధాపూర్ సమీపంలోనే జీఎస్‌ఆర్ కాలనీ గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. మొత్తం కాలనీ వరదనీటిలో చిక్కుకుపోతోంది.

'సాక్షి' వరుస కథనాలు..

జిల్లా కేంద్రమే ఏటా మునిగిపోతుండటంతో స్థానిక ప్రజలూ విస్తుపోతున్నారు. ముంపు కారణాలు తెలిసినా పాలకులు, అధికారులు సరిగా స్పందించడం లేదంటూ ఆరోపిస్తూ వస్తున్నారు. ఇదే క్రమంలో ప్రతీసీజన్‌లో 'సాక్షి' దినపత్రిక సైతం ముందస్తు కథనాలు రాస్తూ వస్తోంది. ఈ ఏడాది కూడా 'మళ్లీ మునగాల్సిందేనా..!?', 'ముంపుపై పట్టింపేది..?' శీర్షికన వరుస కథనాలను ప్రచురించింది.

పరిష్కారం కోసం పరిశీలన..

ఈసారీ నిర్మల్ మునగక తప్పదేమోనన్న పరిస్థితి కళ్లకు కట్టడంతో పాలకులు, అధికారులూ స్పందిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లాకేంద్రంలోని పలు మురికిప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గురువారం పలు ప్రాంతాలను పరిశీలించారు. శివాజీచౌక్, ఏఎస్‌రెడ్డి కాలనీ పెట్రోల్‌బంక్ ఎదుట, తిరుమల థియేటర్ ఎదుట అడ్డదిడ్డంగా ఉన్న డ్రెయినేజీలు సక్రమం చేయాలని, మురుగు, వాననీరు ఆగకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. మిగతా ముంపు ప్రాంతాలపైనా పాలకులు, అధికారులు దృష్టిపెట్టి, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. మరోవైపు మున్సిపల్ అధికారులు శివాజీచౌక్‌లో డ్రెయినేజీల్లో ఆక్రమణల తొలగింపుతోపాటు ముంపు పరిష్కార మార్గాలను చేపడుతున్నారు.

ప్రతీ ఎకరాకు సాగునీరు

- బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



స్వర్ణ ప్రాజెక్టు వద్ద జనరేటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ప్రతీ ఎకరాకు సాగునీరందేలా కృషి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జనరేటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కాలువలు అధ్వాన్నంగా ఉండడం, పూడిక తొలగించకపోవడంతో యాసంగిలో పంటలకు నీరందలేదని తెలిపారు. రూ.10 లక్షలతో జౌళినాళలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడిక తొలగింపు పనులను చేపట్టామని పేర్కొన్నారు. అంతే కాకుండా వర్షాకాలంలో గేట్లు ఎత్తడానికి ఉపయోగపడే జనరేటర్ పాతదికావడంతో దాని స్థానంలో కొత్త జనరేటర్ బిగించామని తెలిపారు. ఇక మీద రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకున్నానని చెప్పారు. అనంతరం జామ్ గ్రామ సమీపంలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విలాస్, నాయకులు రాజేందర్‌రెడ్డి, సాహెబ్‌రావు, సీహెచ్.రాజేశ్వర్, పోతన్న, తిరుమలాచారి, కొరిపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలపై ఫోకస్!



లక్ష్మణచాంద మండలంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ కోసం గుర్తించిన గోదాం

- నిర్వహణకు మండలానికో యూనిట్
- ప్రభుత్వ స్థలాలు, భవనాలు గుర్తించాలని ఆదేశాలు
- ఒక్కో యూనిట్‌కు రూ.16 లక్షలు మంజూరు
- నిర్వహణ బాధ్యతలు మహిళా సంఘాలకు..

నిర్మల్‌చైన్‌గేట్: ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను మరింత మెరుగ్గా చేపట్టడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా మండలానికో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ప్రభుత్వ భవనాలు, స్థలాలు గుర్తించాలని మండలాల అధికారులకు ఆదేశాలు అందాయి. వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ఇటీవల మహిళా సంఘాల నేతృత్వంలో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల యూనిఫాం బాధ్యతలు, క్యాంటీన్ల నిర్వహణ కూడా వారికే అప్పగించారు. పంచాయతీకో మీసేవ కేంద్రాలు కూడా మహిళలకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ల బాధ్యతలు కూడా మహిళలకే అప్పగించనుంది. తద్వారా సంఘాల్లోని సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఒక్కో యూనిట్‌కు రూ.16 లక్షలు..

మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లలో కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లను కటింగ్ చేసేందుకు ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేస్తారు. ఇందు కోసం ఒక్కో యూనిట్‌కు రూ.16 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఈ నిధులతో యంత్రాలను కొనుగోలు చేసి కటింగ్ చేయించిన బాటిళ్లు, కవర్లను రీసైక్లింగ్‌కు పంపిస్తారు. ప్రతీ పంచాయతీలలో సేకరించిన కవర్లు, బాటిళ్లను వారానికోసారి యూనిట్‌కు పంపించాల్సి ఉంటుంది. తద్వారా కవర్లు, బాటిళ్లు పేరుకుపోకుండా శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్‌కు అవకాశం లభించనుంది.

ప్రభుత్వ భవనాల కోసం అన్వేషణ..

మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లకు అవసరమైన ప్రభుత్వ భవనాలను ఎంపిక చేయాలని జిల్లా అధికారుల నుంచి మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు అందాయి. ఈమేరకు అధికారులు భవనాల కోసం అన్వేషణ ప్రారంభించారు. పలు మండలాల్లో భవనాలు ఉన్నా సరైన సౌకర్యాలు లేవని తెలుస్తోంది. దీంతో వాటి మరమ్మతులకు సైతం నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం భవనాలు లేకపోతే అద్దెకు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యంగా...

గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుని చిరు వ్యాపారాలు చేస్తుండడంతో సభ్యుల ఆర్థికాభివృద్ధి అనుకున్న స్థాయిలో జరగడం లేదని గుర్తించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో తాజాగా విద్యార్థుల యూనిఫాం స్టిచింగ్ బాధ్యతలు, క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలు, మీసేవ కేంద్రాలను ప్రభుత్వం కేటాయిస్తోంది. ఇప్పుడు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల ఏర్పాటుతో అటు కాలుష్యానికి చెక్ పెట్టడంతోపాటు మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతమవుతారని ప్రభుత్వం భావిస్తోంది.

సర్వే కొనసాగుతోంది

ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల స్థాపన కోసం స్థల సర్వే చేయాలని సంబంధిత అధికారులకు సూచించాం. మండలానికో యూనిట్ స్థాపించాలని ఆదేశాలు అందాయి. దీంతో ప్రభుత్వ భవనాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. యూనిట్ల ఏర్పాటు అనంతరం అర్హులైన మహిళా సంఘాలను ఎంపిక చేసి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తాం. – విజయలక్ష్మి, డీఆర్డీవో

అభివృద్ధికి కరోనాతో అంతరాయం



పదవీకాలం ముగింపు సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో జెడ్పీటీసీల గ్రూప్ ఫొటో

- ఐదేళ్ల పనితీరు సంతృప్తినిచ్చింది
- జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి
- ఘనంగా వీడ్కోలు సభ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

నిర్మల్‌రూరల్: పనిచేసిన ఐదేళ్లు ఎంతో సంతృప్తి ఇచ్చిందని, కానీ కరోనా కారణంగా జిల్లాను మరింత అభివృద్ధి చేయలేకపోయానని జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి అయిన సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను అభివృద్ధి చేశానన్నారు. పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాలంతో పోటీపడి పని చేసినప్పుడు సమయం ఏర్పడలేదన్నారు. తన హయాంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. పదవి పూర్తయినా ప్రజాసేవలో ముందుంటానని పేర్కొన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీలను ప్రజాప్రతినిధులు, జిల్లా పరిషత్ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, జెడ్పీటీసీలు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో గజానన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: నీట్ పరీక్షల్లో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని గురువారం దేశవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ నిర్మల్‌లో విజయవంతమైంది. బంద్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తరగతుల బహిష్కరించి కళాశాల బయట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో అక్రమాలతో కేంద్రం 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసిందన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని వెంటనే రద్దు చేసి, మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. అవకతవకలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ పూర్తి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంబడి రాకేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగారి వెంకటేశ్, మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దిగంబర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాష్, నాయకులు కిరణ్, శ్రావణ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై చర్య తీసుకోవాలి

భైంసాటౌన్: నీట్ పరీక్షలో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు షేక్ అంజాద్ డిమాండ్ చేశారు. విద్యాసంస్థల బంద్ సందర్భంగా పలు విద్యార్థి సంఘాలతో కలిసి పట్టణంలో బంద్‌ను పర్యవేక్షించారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రాష్ట్రాలే నిర్వహించుకునే అధికారం కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి స్వప్నిల్, నాయకులు జంగ్మే సాకేత్, నాగార్జున, ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకుడు జె.రాహుల్ పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వనమహోత్సవం విజయవంతానికి చర్యలు తీసుకోవాలని, నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వనమహోత్సవం అమలు, శాఖల వారీగా లక్ష్యం తదితర అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీ నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జియో ట్యాగింగ్, నాటిన మొక్కల వివరాలు రోజువారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పూలు, పండ్లు, ఔషధ మొక్కలు అందుబాటులో ఉంచాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన మొక్కలను పంపిణీకి సిద్ధంగా ఉంచాలన్నారు. శాఖల వారీగా గ్రామ, మండల, పట్టణ ప్రభుత్వ కార్యాలయాలలోని ఖాళీ ప్రదేశాల్లో విరివిరిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. శాఖల వారీగా మొక్కల సంఖ్య, అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాల వివరాలను సమర్పించాలని సూచించారు. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, శ్మశాన వాటికలు, పోలీస్ స్టేషన్లు, అటవీశాఖ, ఇతర కార్యాలయాల్లో ఖాళీ ప్రదేశాలలో విరివిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. వనమహోత్సవంలో ప్రజలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అటవీ శాఖ అధికారులు ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజు, డీపీవో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పీఎం విశ్వకర్మ' లబ్ధిదారులను గుర్తించాలి

పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులను త్వరగా గుర్తించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీఎం విశ్వకర్మయోజన పథకంపై సమీక్ష నిర్వహించారు. గ్రామాలవారీగా ఇప్పటివరకు దరఖాస్తుల నమోదు వివరాలపై అధికారులతో చర్చించారు. పథకం అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ గ్రామంలో పంచాయతీ సెక్రెటరీలు అర్హులను గుర్తించాలన్నారు. ఎంపిక అత్యంత పారదర్శకంగా ఉండాలని సూచించారు. లబ్ధిదారులకు మొదటి విడతలో ఐదు శాతం వడ్డీకే రూ.లక్ష రుణం అందిస్తామని తెలిపారు. ఈ మొత్తాన్ని 18 నెలల్లో చెల్లించిన వారికి రెండో విడతలో రూ.2 లక్షల రుణం ప్రభుత్వం అందిస్తుందన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, డీపీవో శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, స్టీరింగ్ కమిటీ సభ్యులు రాజు, రాజేశ్వర్‌రెడ్డి, గంగాధర్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు స్పందన

నిర్మల్ టౌన్: ఆర్టీసీ నిర్మల్ డిపోలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన వచ్చినట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. గొల్లమాడకు ఉద యం 8 గంటలకు ఒక బస్సు వేయాలని, నిజా మాబాద్ బస్సులకు అంకాపూర్ స్టాప్ పెట్టా లని, మాదాపూర్ ఎక్స్ రోడ్‌కు ఎక్స్‌ప్రెస్ స్టేజీ ఇవ్వాలని కోరారు. అనంతపేట్ మీదుగా మేడిపెల్లి బస్సు నడపాలన్నారు. అప్పారావుపేట బస్సుకు పాత టైమింగ్‌లే ఉంచాలని, లోకేశ్వరం నుంచి నిజామాబాద్‌కు బస్సు నడపాలని పలువురు ఫోన్ ద్వారా కోరారు, డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా బస్సులు ఏర్పాటు చేస్తానని తెలిపారు.

క్లుప్తంగా

రెండు కిలోల గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు

బెల్లంపల్లి: పోలీసులు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతూనే ఉంది. కొందరు యువకులు గుట్టుగా కిలోల కొద్ది గంజాయిని రవాణా చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. తాజాగా గురువారం మహారాష్ట్ర నుంచి ఓ యువకుడు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడటం మరోమారు సంచలనమైంది. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టగా మందమర్రికి చెందిన రవి తేజ అనే యువకుడు బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించాడు. అతడి వద్ద బ్యాగు తనిఖీ చేయగా అందులో 2 కిలోల గంజాయి లభ్యమైంది. మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడు రవితేజను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీటి ప్రవాహంలో ఒకరు గల్లంతు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కెలికే గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటిలో కొట్టుకుపోయి గురువారం ఒకరు గల్లంతయ్యారు. జైనూర్ మండలంలోని సంబాజీగూడకు చెందిన జాదవ్ ప్రకాశ్ కెరమెరి మండలంలోని లేండిగూడ నుంచి జైనూర్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. భారీ వర్షం కురియడంతో మార్గమధ్యలో ఉన్న కెలికే కల్వర్టు దాటుతున్న క్రమంలో వరద తాకిడికి నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గుంపుల విజయ్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. రక్షణ చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

బావిలోపడి విద్యార్థి మృతి

లింగాపూర్: ప్రమాదవశాత్తు బావిలోపడి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన ఆత్రం రామకృష్ణ (15) ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం గ్రామ శివారులోని ఆత్రం విశ్వంబర్‌కు చెందిన వ్యవసాయ బావివద్దకు స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని తండ్రి ఆత్రం జగదీశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొట్టె ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఉచిత శిక్షణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా పరిసర గ్రామాల్లోని నిరుద్యోగ యువకులకు వోల్వో, డంపర్, ట్రక్ ఆపరేటింగ్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీజీఎం పర్సనల్ అరవింద రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసై హెవీగూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, మూడేళ్ల అనుభవం, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న వారు ఈనెల 10లోగా ఎంవీటీసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మొక్కలు నాటాలి

లక్సెట్టిపేట: పాఠశాలలో మొక్కలు నాటాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోని బలరావుపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పాఠశాల ఆవరణలో చెత్త పిచ్చిమొక్కలు లేకుండా చూడాలన్నారు.

పాముల కాలం.. జర భద్రం

'బాబోయ్ పాము' అంటూ భయపడే రోజులొచ్చేశాయ్. వర్షాకాలంలో భూమి మొత్తం తడిసి పుట్టల్లో నీరు నిలవడంతో విషసర్పాలు బయట సంచరిస్తుంటాయి. పొలాల గట్లవెంట, పంటచేను సమీపంలోని ఇళ్లు, గుడిసెలు అన్నీ వీటికి ఆవాసాలే. మనిషి ప్రాణాలు తీసే సర్పాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇందుకు ముందస్తుగా కొన్ని రక్షణ చర్యలు తీసుకుంటే కొంతవరకు ముప్పు నుంచి బయట పడవచ్చు.

- పొంచి ఉన్న సర్పాల గండం
- పల్లెలు, పంట పొలాల్లో భద్రం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



తలమడుగు: ఉమ్మడి ఆదిలాబాద్ అడవుల జిల్లా కావడంతో విషసర్పాల బెడద అధికంగానే ఉంది. ఏటా పాము కాటుతో పలువురు మృత్యువాత పడుతున్నారు. గతేడాది జిల్లాలో 152 మంది పాము కాటు కు గురయ్యారు. ఎండాకాలంలో వ్యవసాయ పనులు ముగిశాక పంటచేలల్లోని గట్లవెంట, బొరియలు, పుట్టల్లో ఇవి ఆవాసం ఉంటాయి. నివాస గృహాలకు సమీపంలోని చెట్ల పొదల్లో, కట్టెల వెంబడి కూడా ఉంటాయి. అయితే వర్షాకాలంలో పొలాలు మొత్తం బురదమయంగా మారడం, వీటి ఆవాసాల్లోకి నీరు చేరడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వివిధ రకాల పాములు బయటికి వచ్చి పొడిభూమి వైపునకు వెళ్తాయి. ఈ క్రమంలోనే సమీపంలో ఇళ్లలోకి వస్తాయి. కోళ్లు, ఎలుకలు సంచరించే గృహాల వైపు ఆహార వేటకు వెళ్తాయి. ఇంటి ఆవరణలో పడేసి ఉన్న వంటచెరకు, తట్టలు, బుట్టలు, బస్తాల చాటు ను ముడుచుకుని అదునుకోసం వేచి చూస్తుంటా యి. ఇంటి చూరుల్లోకి చేరుతాయి. వాటి సమీపంలోకి మనుషులు వెళ్లి ఏదైనా పనులు చేస్తున్న క్రమంలో అవి కాటు వేస్తాయి. ఇక పంటచేలలో ప నులు చేసే రైతులు, కూలీలు కూడా పాము కాటుకు గురవుతుంటారు. పచ్చికలు, కలుపు మొక్కల మాటున, గట్ల మీద ఉండే పాముల సమీపంలోకి వెళ్లినప్పుడు వాటి మీద కాలు పడినప్పుడు కాటు వేస్తాయి. ఇలాంటి ప్రమాదాల్లో అనేక మంది చనిపోయిన సంఘటనలున్నాయి.

సర్పాల రకాలు, విష ప్రభావం ఇలా..

విషసర్పాలు రెండు రకాలు ఉంటాయి. ఒకరకం న్యూరోటాక్సిన్ నాగుపాము, రెండో రకం హిమోటాక్సిన్ రక్తపింజర. న్యూరోటాక్సిన్ రకం పాము కాటువేస్తే నోటినుంచి నురుగువచ్చి శ్వాస ఆడక ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. హిమోటాక్సిన్ రకం పాము కాటు వేస్తే శరీరంలోని రక్తనాళాల్లోని కణజాలం నశించి కాటువేసిన భాగంలో వాపు వచ్చి క్రమంగా మృతి చెందే అవకాశం ఎక్కువగా ఉంది. నాగుపాము కాటేస్తే పదిహేను సెకన్లలో విషం ఎక్కుతుంది. కట్లపాము కాటేస్తే క్షణంలో రక్తంలోకి ఎక్కుతుంది. రక్తపింజర కాటేస్తే రెండు గంటల తర్వాత విషం ఎక్కుతుంది. జెర్రిపోతు, నీరుకట్టె, వానపాములు కాటేస్తే విషప్రభావం ఉండదు.

అప్రమత్తంగా ఉండాలి

కప్పలు, ఎలుకలు సంచారం ఉన్న ప్రదేశంలో పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఇంటి ఆవరణ, పరిసరాల్లో నీటి నిల్వలు, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలి. ఇల్లు కడిగిన తర్వాత నీళ్ల బయటకు వెళ్లే రంధ్రాలు రాత్రి సమయంలో గుడ్డలు పెట్టి మూసి ఉంచాలి. బయటకు వెళ్తే చెప్పులు లేదా షూ వేసుకోవాలి. రాత్రి సమయంలో చేనువద్దకు వెళ్తే చేతికర్ర, టార్చిలైట్ కచ్చితంగా తీసుకెళ్లాలి. ఇంట్లో పడుకునేటప్పుడు కప్పుకునే దుప్పట్లు బాగా దులపాలి. నవారు, నులక మంచాలను చిన్న కర్రతో కొట్టి అందులో ఏమీలేవని నిర్ధారించుకున్న తర్వాతే వేసుకోవాలి.

కాటేశాక ఆందోళన చెందితే ఇంకా ప్రమాదం

పాముకాటుకు గురైన వారు ఆందోళన చెందకుండా నిర్భయంగా ఉండాలి. భయపడితే గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. పాము కాటువేసిన ప్రదేశంలో గట్టిగా కట్టుకట్టాలి. వెంటనే సమీపంలో ఉన్న వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలి. విషపూరితమైన పాము కాటువేస్తే శరీరం క్రమంగా నీలిరంగులోకి మారుతుంది. పాముకాటు వేసిన చోట నొప్పి, వాపు ఉంటాయి. కొందరికి పొక్కులు, దద్దుర్లు వస్తాయి. మరికొందరికి నోటి నుంచి నురగలు వస్తాయి. ఆయాసం వచ్చి శరీరమంతా చెమటలు పట్టి కోమాలోకి వెళ్తారు. అప్పుడు సాధారణం కంటే గుండె రెట్టింపు స్థాయిలో కొట్టుకుంటుంది. కచ్చితంగా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి. నాటు వైద్యం పసర్లను నమ్మవద్దు.

భయాందోళనకు గురికావొద్దు

పాముకాటు గురైన వారు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దు. భయపడితే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. కాటు వేసిన వెంటనే కొందరు నాటువైద్యులను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. పాముకాటుకు గురైన వారు జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆరోగ్య కేంద్రంలో పాముకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయి.

– హరీశ్, వైద్యాధికారి, తలమడుగు పీహెచ్‌సీ

ఆశ్రమ పాఠశాల తనిఖీ

నార్నూర్: మండలంలోని జామ్‌డా బాలికల ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ రాజర్షిషా గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాతో కలిసి తనిఖీ చేశారు. తరగతి గదులు పరిశీలించి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించి హెచ్‌ఎం చౌహాన్ నెహ్రూకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీపీఆర్వో తిరుమల, పీడీ విశ్వనాథ్ తదితరులున్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



పాఠశాలలో హాజరు పరిశీలిస్తున్న డీఈవో

తలమడుగు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో ప్రణీత సూచించారు. గురువారం మండలంలోని పల్సి బీ గ్రామంలోగల జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. హాజరు శాతాన్ని పరిశీలించారు. సిలబస్ వివరాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులున్నారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే

మందమర్రిరూరల్: ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవడం ఎంతో ముఖ్యమని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. హైదరాబాద్‌లో కీర్తి అకాడమిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అటెంప్ట్ టూ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు పోటీల్లో కళాకీర్తి శిఖర అవార్డుతో పాటు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు, ప్రశంస పత్రాలు అందుకున్న చిన్నారులను అభినందించారు.

'బొంతల ముచ్చట్లు' ఆవిష్కరణ



పెద్దవాగు వద్ద పుస్తకం ఆవిష్కరిస్తున్న శ్రీధర్ దేశ్‌పాండే

బోథ్: మాజీ సీఎం కేసీఆర్ వద్ద నీటిపారుదల శాఖ ఓఎస్డీగా విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందిన ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు శ్రీధర్ దేశ్‌పాండే తన చిన్ననాటి అనుభవాలను పుస్తక రూపంలో పొందుపరిచారు. ఆయన స్వస్థలమైన బోథ్ గురించి, భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక అంశాలను అందులో పొందుపరిచారు. బోథ్‌ను గతంలో బొంతలగా పిలిచేవారు. దీంతో ఆయన రాసిన పుస్తకం పేరును 'బొంతల ముచ్చట్లు'గా నామకరణం చేశారు. ఆడంబరాలకు వెళ్లకుండా ఈ పుస్తకాన్ని తాను చదివిన పాఠశాల, గ్రంథాలయం, ఈత కొట్టిన పెద్దవాగు, ఆడుకున్న పలు ప్రాంతాల్లో తన గురువులు, చిన్ననాటి స్నేహితుల మధ్య ఆవిష్కరించారు. బోథ్‌గా పిలిచే బొంతల ప్రాంతంలో కొండలు, గుట్టలు, సౌందర్యకరమైన పరిసరాలు, ఈ ప్రాంత వాసులు ఆచార వ్యవహారాలు, భాష, యాస, పద్ధతులను, ఈ ప్రాంత చరిత్రను భావితరాలకు తెలియజేయాలని పుస్తకం రాసినట్లు శ్రీధర్ దేశ్‌పాండే తెలిపారు. ఈ కార్యక్రమంలో అతని గురువులు అంబదాస్, నందయ్య, దేవన్న, 1978లో తనతో పాటు చదివిన మిత్రులు రమేశ్‌బాబు, నర్సయ్య, సదానందం, అరవింద్, అబుల్కా అడెల్లు, మురళి, ముస్తఫా, సురేష్ వైద్య, భాస్కర్‌తో పాటు రావుల శంకర్ పాల్గొన్నారు.

వేరుశనగ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్

ఆదిలాబాద్‌టౌన్: గోదాముల్లో నిల్వ ఉంచిన వేరు శనగ బస్తాలను దొంగిలించిన ముగ్గురు దొంగలను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గతనెల 14న ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీనాథ్ జిన్నింగ్‌లో పది క్వింటాళ్ల వేరుశనగ సంచులు నిల్వ ఉంచగా వాటిని ఎత్తుకెళ్లారు. వాటితో పాటు సాగుకు సంబంధించిన రెండు బోరు మోటర్లను సైతం ఎత్తుకెళ్లారు. బాధితుడు పిరాని అన్వర్‌అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నిందితులు ఖుర్షీద్‌నగర్‌కు చెందిన సయ్యద్ జావీద్, సుందరయ్యనగర్‌కు చెందిన తబ్రేజ్, సయ్యద్ ఇర్ఫాన్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. వారి నుంచి 3 క్వింటాళ్ల వేరుశనగ, బోరు మోటర్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను పట్టుకున్న క్రైం పార్టీ పోలీసులు రమేశ్, నరేష్, క్రాంతి, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్, నరేందర్‌ను సీఐ అభినందించారు.

పుస్తెలతాడు చోరీ

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు భూక్య యమున ఇంట్లోకి గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ఆమె మెడలో ఉన్న రెండుతులాల బంగారు పుస్తెలతాడు అపహరించారు. ఈ క్రమంలో వృద్ధురాలిని బలవంతంగా నెట్టివేయడంతో తలకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సీఐ నరేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఏఎస్సై పున్నం తెలిపారు.

వైద్యాధికారులు సమయపాలన పాటించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఉట్నూర్‌రూరల్: వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి ఐటీడీఏ పరిధిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ క్యాంపులు, ఏపిడవిట్ క్యాంపులు కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలకు సమయానికి మందులు అందేవిధంగా చూడాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ రిజిస్టర్లు పాటించాలని, రోడ్లు లేని గ్రామాలను గుర్తించి అవ్వల్ అంబులెన్స్ పోయే విధంగా మరమ్మతులు చేపడతామన్నారు. నీటికొరత లేకుండా చూడాలన్నారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారులు డాక్టర్ రాథోడ్ నరేందర్, అదనపు వైద్యాధికారి మనోహర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు


ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి టార్గెట్ బాల్ ఎంపిక పోటీల్లో సత్తా చాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని గౌరీ, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన వంశీ జూలై 9 నుంచి 12 వరకు నేపాల్‌లో జరగనున్న టార్గెట్ బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు ఇరు కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, అనిత గురువారం సైన్స్ డిగ్రీ కళాశాలలో క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరిలో సిద్దిపేటలో నిర్వహించిన జాతీయ స్థాయి టార్గెట్ పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. వారిలో తమ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉండడం గర్వకారణమన్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్

సారంగాపూర్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన కొత్తపాటి రాజు (38) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య దేవికతో గొడవపడేవాడు. 15 రోజుల క్రితం అతని బాధ భరించలేక దేవిక సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ఉన్న పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం తెల్లవారు జామున మృతుని చిన్నాన్న చిన్నలింగన్న అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. దేవిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.



పురుగుల మందు తాగి ఒకరి బలవన్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కచికంటి గ్రామానికి చెందిన దాసరి ఆశన్న (38) గురువారం పురుగుల మందు తాగి బలవన్మరణం చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆశన్న భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది కచికంటి గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. అటుగా వెళ్లిన వారు గమనించి 108కు సమాచారం అందించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

బెజ్జూర్: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కృష్ణపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాయిని గంగయ్య (65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక గురువారం తెల్లవారు జామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నెన్నెల: మండలంలోని చిన్నవెంకటాపూర్ గ్రామానికి చెందిన చెల్కల విజయ (35) కిడ్నీలో నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. విజయ మూడేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. బుధవారం పత్తి విత్తనాలు వేయడానికి పంట చేనుకు వెళ్లగా అక్కడ మరోసారి తీవ్రమైన నొప్పి రావడంతో బాధ భరించలేక అక్కడే ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాలకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని మిమ్స్‌కు తీసుకెళ్లడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి!



రోడ్డుపై బైఠాయించిన కుటుంబ సభ్యులు

- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల రాస్తారోకో

కాగజ్‌నగర్‌రూరల్: వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దహెగాం మండలం కల్వాడకు చెందిన గర్భిణి ఇస్తావత్ సవితను కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షల కోసం చేర్పించారు. 9 నెలలు కూడా నిండకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఆపరేషన్ చేసినట్లు ఆమె భర్త రమేశ్ తెలిపారు. పుట్టిన పసికందును స్థానిక పిల్లల వైద్య నిపుణుడి వద్దకు తీసుకెళ్లగా ఆరోగ్యంగా ఉందని చెప్పడంతో ఆస్పత్రిలోనే ఉన్నామన్నారు. గురువారం ఉదయం పసికందు మృతి చెందిందని వైద్యులు చెప్పారని ఆయన పేర్కొన్నారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మృత్యువాత పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి సీఐ శంకరయ్య, ఎస్సై అంజయ్య చేరుకుని సముదాయించడంతో రాస్తారోకో విరమించారు.